సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 7 । జూలై । 2025



టీచర్లకు షరతులు

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.ఓ కార్యక్రమం నిర్వహణపై విద్యాశాఖ అధికారులు షరతులు విధించారు. వీటిని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. 8లో



ప్రాణాంతకం.. గొంతువాపు

వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, గుది పెట్టు వ్యాధులు సోకే ప్రమాదముందని రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



6,325 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 6,325 కేసులు పరిష్కారమైనట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ఎస్సై కుటుంబానికి చేయూత



అశోక్ కుటుంబ సభ్యులకు చెక్ అందిస్తున్న ఉమ్మడి రాష్ట్ర పోలీసు అధికారులు

నరసాపురం : తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు ఎస్సైగా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై ఎం.అశోక్ కుటుంబానికి సహచర పోలీసు అధికారులు అండగా నిలిచారు. ఉమ్మడి రాష్ట్రంలోని 2009 బ్యాచ్‌కు చెందిన 1,100 మంది సీఐలు, ఎస్సైలు 2009 బ్యాచ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.26 లక్షలు సేకరించారు. సోమవారం నరసాపురంలోని అశోక్ ఇంటి వద్ద జరిగిన సంతాప కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ఆయన కుటుంబానికి అందించారు. తర్వాత ఆలమూరు వెళ్లి ఎస్సైతో పాటు మృతి చెందిన కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్ కుటుంబానికి రూ.5 లక్షలు అందించారు. నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి మాట్లాడుతూ 2009 బ్యాచ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఎలాంటి ఆపద వచ్చినా స్పందిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ రూ.2 కోట్లకుపైగా ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు.

10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

కలెక్టర్ నాగరాణి



భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఈనెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను నిర్వహించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ఆదివారం గూగుల్ మీట్ ద్వారా కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, డీఆర్వో మొగలి వెంకటేశ్వర్లు, అధికారులు, ప్రైవేట్ పాఠశాలల, జూనియర్ కళాశాలల అసోసియేషన్స్ ప్రతినిధులతో ఆమె సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఉరకలేస్తున్న గోదావరి



నరసాపురంలో వలంధర్ రేవు వద్ద గోదావరి

పెనుగొండ/నరసాపురం : వశిష్టా గోదావరి వరద నీటితో ఉరకలేస్తోంది. రెండు రోజులుగా గోదావరిలోకి ఎర్రనీరు వచ్చి చేరుతోంది. పెనుగొండ మండలం దొంగరావిపాలెం, చినమల్లం, పెదమల్లం, కోడేరు, భీమలాపురం వద్ద గోదావరి నిండుగా ప్రవహిస్తుంది. సిద్ధాంతంలో మధ్య లంకను నీరు తాకింది. ఆచంట మండలంలో అయోధ్యలంక, పెదమల్లంలంక, పల్లిపాలెం, పుచ్చల్లంక వద్ద పల్లపు ప్రాంతాలకు నెమ్మదిగా నీరు చేరుతోంది. రైతులు రాకపోకలు సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ఆచంట మండలంలోని లంక గ్రామాల్లో వరదల సమయంలో తాగునీటి ఎద్దడి వస్తోందని, నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నరసాపురంలో..

నరసాపురం: నరసాపురంలోని వశిష్ట గోదావరిలో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. వలంధర్ రేవు వద్ద పరవళ్లు తొక్కుతూ గోదావరిలో నీటి ప్రవాహం కనిపిస్తోంది. గోదావరి క్రమేపీ ఎర్ర రంగులోకి మారుతోంది.

పిచ్చికుక్క స్వైరవిహారం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

బుట్టాయగూడెం : జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెంలో పిచ్చికుక్క 9 మందిపై దాడి చేసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు ఓ పిచ్చికుక్క గ్రామంలో స్వైర విహారం చేస్తూ 9 మందిని గాయపర్చింది. దీంతో గ్రామస్తులు దానిని హతమార్చారు. ఎస్.భద్రమ్మ, ఎస్.నాగేశ్వరమ్మ, పి.కవలమ్మ, కె.రాణి, ఎం.దావీదుతోపాటు మరో నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని జీలుగుమిల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు సకాలంలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాగిస్తాం.. తూలిస్తాం

మద్యం ఏరులు.. బెల్ట్ బారులు

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- వేళాపాళా లేకుండా విక్రయాలు
- ఏలూరులో వీధివీధినా బెల్టు షాపులు
- మద్యం మత్తులో జోగుతున్న యువత
- కూటమి ప్రభుత్వంలో 'ఎనీ టైమ్ మందు'



ఏలూరు సత్యనారాయణ థియేటర్ సమీపంలో మెట్లపై ఇలా..



తప్పతాగి రోడ్డుపై స్పృహ లేకుండా ఓ మందుబాబు



ఏలూరులో ఓ కిళ్లీ కొట్టు వద్ద బహిరంగంగానే మద్యం తాగుతున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా మారింది. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగడంతో పాటు వీధి వీధినా బెల్టుషాపులు దర్శనమిస్తున్నాయి. ఏలూరులో మద్యం మత్తులో యువత జోగుతోంది. మందుబాబులు పూటుగా మద్యం సేవించి ఎక్కడపడితే అక్కడ దొర్లుతున్నారు. నగరంలో పదుల సంఖ్యలో మద్యం షాపులు వీటికి తోడు అనధికారంగా నిర్వహించే బెల్టు షాపుల్లో ఎనీ టైమ్ మందు అందుబాటులో ఉంటోంది. ఫుల్‌గా మద్యం తాగిన మందుబాబులు ఎటు వెళ్లాలో తెలియక రోడ్లపై, షాపుల మెట్ల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో, పార్కుల్లో మద్యం మత్తులో పడి దొర్లుతున్నారు.

గత ప్రభుత్వంలో సమయం మేరకే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించింది. దీంతో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకే విక్రయాలు జరిపేవారు. అలాగే బెల్టుషాపులకు పక్కాగా అడ్డుకట్ట వేశారు. ప్రభుత్వ షాపుల్లో మాత్రమే విక్రయాలు జరపడం, అక్కడ సిట్టింగులు లేకపోవడం, బెల్టుషాపులు ఉండకపోవడంతో యథేచ్ఛగా అమ్మకాలు జరిగేవి కాదు. దీంతో మందుబాబులు ఫుల్‌గా మద్యం తాగి రోడ్లపై దొర్లే దృశ్యాలు కనిపించేవి కావు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి.

సందు సందునా..

కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. ఈ షాపులకు అనుబంధంగా అనధికారికంగా బెల్టుషాపులు వెలిశాయి. బెల్టుషాపులను అడ్డుకుంటామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. మద్యం, బెల్టుషాపులు అధికార పార్టీ నాయకులు, అనుచరులవి కావడంతో అధికారులు అటుగా కన్నెత్తి చూడటం లేదు. నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు. ఏలూరులో గుడి, బడి తేడా లేకుండా బెల్టుషా పులు నిర్వహిస్తుండటంపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

యువత పెడదోవ

యథేచ్ఛగా విక్రయాలతో నగరంలోని యువత మద్యానికి బానిసవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని మహిళా సంఘాలు అంటున్నాయి. గతంలో రోడ్డుకు 200 మీటర్ల దూరంలో మద్యం షాపును నిర్వహించే వారు. కూటమి ప్రభుత్వంలో ఈ నిబంధన లేకపోవడంతో రోడ్లను ఆనుకుని దుకాణాలు ఏర్పాటుచేశారు. దీంతో అటుగా వెళుతున్న వాహనచోదకులు, మహిళలు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

విచ్చలవిడిగా అమ్మకాలు



ఏలూరు నగరం పరిధిలో మద్యం షాపుల ఏర్పాటు, బెల్టు షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా ఎన్ని ఆందోళనలు చేపట్టినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులకు సైతం వీటికి వ్యతిరేకంగా వినతి పత్రాలు అందజేశాం. ఓపక్క మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోవడానికి యథేచ్ఛగా మద్యం అమ్మకాలు కారణంగా కనిపిస్తోంది. తక్షణమే విచ్చలవిడి మద్యం అమ్మకాలను నిలుపుదల చేయాలి.

– ఎ.రాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి, ఏలూరు

బెల్టు షాపులను అడ్డుకోవాలి



నగరంలో ఏ సందులో చూసినా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. కిళ్లీకొట్లు, షాపులు, హోటళ్లు అనే తేడా లేకుండా అధికార పార్టీలకు చెందిన నాయకులు, వారి అనుచరులు విచ్చలవిడిగా వీటిని ఏర్పాటు చేసేశారు. దీంతో మందు బాబులకు షాపులకు వెళ్లి తాగాల్సిన అవసరం లేకుండా అందుబాటులోనే మద్యం దొరుకుతోంది. బెల్టు షాపులను అరికట్టాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు చోద్యం చూస్తుండటం విడ్డూరంగా ఉంది.

– ఎం.అరుణకుమారి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు, ఏలూరు

ఇంటింటా మద్యం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటా విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందేవి. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వ పాలనలో ఇంటింటా మద్యం విచ్చలవిడిగా దొరుకుతుంది. ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్త ఇళ్లల్లో మద్యం ఫుల్‌గా లభిస్తోందంటే అతిశయోక్తి లేదు. ఇంటింటా రేషన్ సరుకులను అందించే వాహనాల్లో ఇప్పుడు మద్యం సరఫరా చేయడం సిగ్గుచేటు.

– జుజ్జువరపు విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు, ఏలూరు

మద్యం మత్తులో యువత చిత్తు



బడి, గుడి తేడా లేకుండా అన్నిచోట్లా విరివిగా మద్యం లభిస్తుండటంతో యువత ఫుల్‌గా మద్యం తాగి చిత్తుగా తయారవుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయాయి. యువత పెడదోవ పడుతోంది. యువతను విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారాల్లో అభివృద్ధి చేయాల్సిన పాలకులు వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేలా యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేస్తుండటం బాధాకరం.

–ప్రత్తిపాటి తంబి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నగర అధ్యక్షుడు, ఏలూరు

ఆర్టీసీ ఆదాయం భేష్

- అదనపు మార్గాల ద్వారా రాబడి
- కార్గో, స్థలాల లీజులు, షాపుల అద్దెల ద్వారా ఆదాయం
- ఏడాదికి రూ.8 కోట్ల వరకు..



భీమవరంలో ఆర్టీసీ బస్టాండ్

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమ ఆర్టీసీ అదనపు ఆదాయంలో దూసుకుపోతోంది. బస్సు సర్వీసులతో పాటు కార్గో, ఖాళీ స్థలాల లీజులు, షాపుల అద్దెల ద్వారా మంచి ఆదాయం గడిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు అదనపు ఆదాయానికి పూర్తి సహకారం అందించింది. దీంతో 2021 నుంచి జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకులో డిపోలతో పాటు పాలకొల్లులో బస్టాండ్‌లు ఉన్నాయి.


కార్గో ఆదాయం రయ్‌రయ్

జిల్లాలోని ఐదు బస్టాండ్లలో కార్గో సేవలు అందిస్తున్నారు. వీటి ద్వారా సుమారు రూ.6 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రూ.1.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఏటా కార్గో ఆదాయం ఒక్కో బస్టాండ్‌లో రూ.30 లక్షల వరకు పెరుగుతోంది. డోర్ డెలివరీ సౌకర్యం, ప్రైవేట్ వ్యక్తులకు ఏజెన్సీలు ఇవ్వడం ద్వారా మరింత ఆదాయం ఆర్జిస్తున్నారు.

లీజులు.. అద్దెల ద్వారా..

జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలోని ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వడం, బస్టాండ్‌ల వద్ద ఖాళీ స్థలాల్లో షాపులు నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా ఏడాదికి రూ.1.8 కోట్ల ఆదాయం గడిస్తోంది. తాడేపల్లిగూడెం డిపో కార్గో ద్వారా రూ.1.85 కోట్లు, ఖాళీ స్థలాల లీజులు, షాపుల అద్దె ద్వారా రూ.89.68 లక్షలు గడిస్తూ ముందంజలో ఉంది. తాజాగా భీమవరం డిపో సమీపంలోని శిథిలావస్థలో ఉన్న ఆర్టీసీ క్వార్టర్స్‌ను తొలగించి భూమి లీజు ఇవ్వడానికి సోమవారం నుంచి టెండర్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. భీమవరంలో షాపుల అద్దెల ద్వారా రూ 2.50 లక్షలు, తణుకు డిపో పరిధిలోని అత్తిలిలో భూమి లీజు ద్వారా రూ.1.50 లక్షలు, నరసాపురం డిపో పరిధిలోని మార్టేరులో భూమి లీజు ద్వారా రూ.12 లక్షల ఆదాయం వస్తోంది.

ప్రజల ఆదరణతోనే..



పశ్చిమ ఆర్టీసీ ప్రజల ఆదరణతో బస్సులతో పాటు మంచి అదనపు ఆదాయం కూడా సాధిస్తోంది. కార్గో సేవలను ప్రజలు బాగా ఆదరిస్తున్నారు, ఏడాదికి రూ.6 కోట్ల ఆదాయం వస్తుంది. అలాగే భూములు, షాపుల వల్ల కూడా రాబడి బాగుంది. భీమవరంలో 1.5 సెంట్ల భూమి లీజుకు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నాం. అలాగే అదనపు ఆదాయం కోసం ప్రణాళికలు రూపొందించాం.

– ఎన్వీఆర్ వరప్రసాదరావు, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి

కార్గో ఆదాయం (రూ.కోట్లలో)

డిపో	2021-22	2022-23	2023-24	2024-25
భీమవరం	1.14	0.98	1.60	1.86
తాడేపల్లిగూడెం	1.80	1.47	1.32	1.85
నరసాపురం	0.66	0.65	1.04	1.19
తణుకు	0.86	0.86	1.04	1.61

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట

పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు మురళీ కృష్ణంరాజు



తణుకులో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు మురళీ కృష్ణంరాజు, మాజీ మంత్రి కారుమూరి, పార్లమెంట్ ఇన్‌చార్జి ఉమాబాల



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

తణుకు అర్బన్: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీగా మారిన కూటమి ఏడాది పాలనను ప్రజలు చీదరించుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో ఆదివారం మాజీ మంత్రి కారుమూరి అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముదునూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు ఇవ్వకుండా మోసగించిన తీరును ప్రజలకు వివరించారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను మోసం చేశారని విమర్శించారు. వైద్య కళాశాలలను వెనక్కి నెట్టడంతో పాటు జూనియర్ డాక్టర్లను రోడ్డెక్కించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఏం ఒరగబెట్టారని తొలి అడుగంటూ ప్రజల్లోకి వెళ్తున్నారని ప్రశ్నించారు. భవిష్యత్తులో జగన్ ప్రభంజనం సృష్టిస్తారన్నారు. ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి హామీలను అమలుచేసేలా పోరుబాట పడతామని అన్నారు.

వాస్తవాలను అణగదొక్కాలనే 'సాక్షి' ప్రసారాలపై చంద్రబాబు కుట్ర

కూటమి ముసుగులో జరుగుతున్న దాడులు, హత్యలు, విధ్వంసకర ఘటనలను వెలుగులోకి తెస్తూ వాస్తవాలను ప్రజల ముందుంచుతున్న 'సాక్షి' మీడియాపై సీఎం చంద్రబాబు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. నిజాలను ప్రజల ముందుకు తెస్తున్న సాక్షి మీడియాను అణగదొక్కాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇకపై పార్టీ అభిమానులంతా డిష్ టీవీ కమ్యూనికేషన్ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. తద్వారా ప్రజలకు 'సాక్షి' టీవీ ప్రసారాలు అందుబాటులోకి వచ్చి నిజాలు తెలిసేందుకు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. పీ4 పేరుతో రాష్ట్రంలో ఒక ఇంటికి వెళ్లి వారికి కొంత డబ్బిచ్చేసి రాష్ట్రమంతా ఉద్ధరించేసినట్టుగా చంద్రబాబు ఫొటోలకు ఫోజులిస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు తన ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాలకు బటన్ నొక్కేందుకు చేతులు రావడంలేదని, మంగళవారం వస్తే చాలు ఏదోక ఆస్తి తాకట్టుపెట్టి ఇప్పటివరకు రూ.1.70 లక్షల కోట్లు అప్పులు చేసి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ప్రజల్ని నిట్టనిలువునా మోసం చేశారని మండిపడ్డారు.

కూటమి పాపం పండింది

కూటమి ప్రభుత్వం చేసిన పాపం పండి త్వరగానే తిరిగి ఎన్నికలు వస్తాయని నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు మేరకు చంద్రబాబు మోసాన్ని ప్రజలకు అవగాహన వచ్చేలా కార్యకర్తలు తమ ప్రాంతాల్లో కృషి చేయాలని సూచించారు.

క్లబ్‌ల సంస్కృతి

కూటమి పాలనలో ప్రజలకు క్లబ్‌ల సంస్కృతిని అందుబాటులోకి తీసుకువచ్చారని ఎంబీసీ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. ముఖ్యంగా నరసాపురంలో క్లబ్‌లు ఏర్పాటుచేసి ప్రజలకు పేకాటను అందుబాటులోకి తీసుకువచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల అధ్యక్షులు పెనుమర్తి వెంకటరామన్న, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, యిండుగపల్లి బలరామకృష్ణ, జల్లూరి జగదీష్, బుడితి సుజన్‌కుమార్, మెహర్ అన్సారీ, పెన్మెత్స సుబ్బరాజు, మల్లిరెడ్డి నాగార్జున, సబ్బితి రాజేష్, కరిబండి రాజేష్, ఆకుల పండుస్వామి, ఉండవల్లి జానకి, నూకల కనకదుర్గ, బెజ్జవరపు హేమశ్రీ, ఝాన్సీ లారెన్స్ పాల్గొన్నారు.

అమరావతిలో సీన్ రివర్స్

అమరావతిలో సీన్ రివర్స్ అయ్యిందని, మరో 40 వేల ఎకరాలు కావాలనడంతో భూములు ఇచ్చేది లేదంటూ రైతులు ఎదురు తిరిగారని మాజీ మంత్రి కారుమూరి అన్నారు. గో బ్యాక్ అంటూ ఎమ్మెల్యేలు, అధికారులను రైతులు వెళ్లగొడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో పాదయాత్రలు చేసిన వారందరికీ ఇప్పుడు కాలిందన్నారు. బయటకు పోవాలని రైతులు కాండ్రించి ఉమ్మేసే పరిస్థితి వచ్చిందని స్పష్టం చేశారు. సేకరించే భూమిని బ్యాంకులో తాకట్టు పెట్టి ఆ భూమి విలువ పెరిగిన తర్వాత అమ్మేసి అప్పు కట్టేస్తామని మంత్రి నారాయణ అంటున్నారని, ఎవరి ఆస్తి తాకట్టు పెడతారని అది మీ ఆస్తా అని కారుమూరి నిలదీశారు.

శాకంబరీ శరణు శరణు



ముత్యాలంబపురంలో ముత్యాలమ్మవారు

తొలి ఏకాదశి సందర్భంగా అమ్మవార్లు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. భీమవరం శ్రీరాంపురం రోడ్డులోని జగన్మాత కనక దుర్గమ్మ, త్యాగరాజ భవనంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లను కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబపురంలోని ముత్యాలమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

– భీమవరం (ప్రకాశంచౌక్)/తాడేపల్లిగూడెం రూరల్



భీమవరంలో కన్యకా పరమేశ్వరి మాత

మది నిండుగా.. తొలి పండుగ

ద్వారకాతిరుమల: తొలి ఏకాదశి పర్వదినాన ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే క్షేత్రానికి భక్తుల రాక ప్రారంభం కాగా ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో భక్తుల తాకిడి కనిపించింది. ఆలయ అనివెట్టి మండపంలో భజనమండలి సభ్యుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం వరకూ క్షేత్రంలో రద్దీ కొనసాగింది.



ద్వారకాతిరుమల ఆలయ అనివేటి మండపంలో..

క్లుప్తంగా

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారి పుట్టలో పాలు పోశారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కాపవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించడం, ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెదవేగి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్ వివరాల ప్రకారం.. తడికలపూడి నుంచి దోసపాడు రైస్ మిల్లుకు రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు నిఘా పెట్టారు. పెదవేగి మండలం ముందూరు సమీపంలో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ఆ వాహనంలో 4,700 కేజీల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. తడికలపూడికి చెందిన ఈడ్పుగంటి శ్రీనివాస్ రైస్‌మిల్‌కు పంపుతున్నట్లు గుర్తించారు. సరుకు విలువ రూ.1,72000 ఉంటుందని చెప్పారు.

13 మంది అరెస్ట్

కామవరపుకోట: స్థల వివాదంలో 13 మందిని అరెస్టు చేసినట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. రెండ్రోజుల క్రితం కామవరపుకోటలోని వీరభద్ర స్వామి ఆలయానికి సంబంధించిన స్థల వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఘర్షణలో, ఒక వర్గానికి చెందిన ఇంటిపై మరో వర్గం దాడి చేసింది. ఆ ఇంటిని ధ్వంసం చేయడమే కాకుండా ఇంట్లో ఉన్న ముగ్గురు అన్నదమ్ములను తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు షేక్ అబ్దుల్ నబీ ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, ప్రత్యక్ష సాక్ష్యాల ఆధారంగా ఇంత వరకు 13 మందిని గుర్తించారు. వారిని చింతలపూడి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పేరెంట్స్ మీట్‌పై టీచర్లకు షరతులు

- కార్యక్రమం నిర్వహణపై ఇతర శాఖల ఉద్యోగులు సాక్ష్యంగా ఉండాలి
- విద్యా శాఖ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న టీచర్ సంఘాలు



కాకరమిల్లిలో పేరెంట్స్ మీట్‌కు ఆహ్వానం పలుకుతున్న టీచర్

నిడమర్రు: పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.ఓ కార్యక్రమం నిర్వహణపై విద్యాశాఖ అధికారులు షరతు విధించారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12.30 వరకూ జరుగుతుందీ లేనిది ఇతర శాఖ ఉద్యోగి పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ ఉద్యోగి మెగా పీటీఎం రోజున 30 సెకన్ల వీడియో, నాలుగు ఫొటోలు, మొత్తం సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రధానోపాధ్యాయులు ఉపయోగిస్తున్న లీప్ యాప్‌లో సాక్షిగా వచ్చిన వ్యక్తి అప్‌లోడ్ చేయాని గురువులకు విద్యాశాఖ అధికారులు షరుతు విధించారు. దీని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

యాప్‌ల భారంతో సతమతం

ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి అన్ని యాప్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, సరికొత్త యాప్ రూపొందిస్తామని విద్యా శాఖ మంత్రి లోకేష్ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన తొలి సమావేశంలో ప్రకటించారు. లీప్ యాప్‌ను రూపొందించినా.. రోజూ మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం నిర్వహణ వంటి కార్యక్రమాలతోపాటు స్టాక్ అందిన ప్రతిసారి పాత ఐఎంఎంఎస్‌లో నమోదు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల పాఠశాలలకు అందిస్తున్న సన్నబియ్యంపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్టాక్ అందిన వెంటనే స్కాన్ చేయాలి. తర్వాత బస్తా ఓపెన్ చేసిన వెంటనే స్కాన్ చేయాలి. విద్యార్థులకు మొక్కలు, అపార్ ఐడీ క్రియేట్ వంటి అనేక ఆన్‌లైన్ కార్యక్రమాలతో బోధనకు దూరమవుతున్నామంటూ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

కుంటుపడుతున్న బోధన

పాఠశాల తెరిచిన నాటి నుంచి పాఠశాలల్లో సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. 1, 2 తరగతులకు 45 రోజులు, మిగిలిన ప్రాథమిక తరగతులకు 30 రోజులుగా అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఇంతవరకూ గమనిస్తే ప్రారంభంలో బదిలీలు, జాయినింగ్‌లు, రిలీవింగ్‌లతో 10 రోజులు గడిచిపోయాయి. తర్వాత గిన్నిస్ రికార్డ్ కోసం అంటూ యోగాంధ్ర కార్యక్రమాలు, విద్యార్థుల రిజిస్ట్రేషన్లతో మరికొన్ని రోజులు గడిచాయి. జులై 1 నుంచి పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి పెడతామంటే మరో గిన్నిస్ రికార్డు పేరుతో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.ఓ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొక్కల కోసం విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, కమిటీల ఏర్పాటు, ఆహ్వానాలు, మండల స్థాయి నుంచి, పాఠశాల స్థాయి వరకూ ముందస్తు సమావేశాలతో ఉపాధ్యాయులంతా బిజీగా ఉండటతో, బోధనా కార్యక్రమాలు కుంటుపడినట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

ఇతరుల పర్యవేక్షణ అంగీకరించం



ఈ నెల 10న జరిగే మెగా పీటీఎంకు ఇతర శాఖల ఉద్యోగుల పర్యవేక్షణ ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గత పీటీఎంను విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల సహకారంతో విజయవంతం చేశాం. ఇప్పుడు బాహ్య పరిశీలకుల పేరిట ఇతర శాఖ ఉద్యోగుల నియమించడం పాఠశాల నిర్వహణ వ్యవస్థను, ఉపాధ్యాయుల పనితీరు కించపరచడమే.

–షేక్ రంగా వలి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



మెగా పీటీఎంను విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. విద్యాశాఖకు సంబంధం లేని ఓ వ్యక్తిని బాహ్య పరిశీలకుడిగా నియమించుకోవాలని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకే అమలు చేస్తున్నాం. సాక్షి సంతకం నిబంధన గిన్నిస్ బుక్ రికార్డు కోసమే అని, గిన్నిస్ రికార్డుల నమోదు బృందం సూచనల మేరకే సాక్షి సంతం తీసుకుంటున్నట్లు ఉన్నత అధికారులు తెలిపారు.

ఏవీఎస్ఎస్ భాస్కర కుమార్, ఎంఈవో–2, నిడమర్రు

వచ్చే నెలలో షార్ట్ ఫిలిం పోటీలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సారస్వత పరిషత్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: తెలుగు సాహిత్యం, సంస్కృతిని ప్రోత్సహిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ భవనంలో మాట్లాడుతూ.. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిషత్‌కు మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య గౌరవ సలహాదారుగా వ్యవహరిస్తున్నారన్నారు. సంఘ పరిషత్ సభ్యులుగా కెఎస్‌పిఎస్ వర్మ, కె.రాంప్రసాద్, చేగొండి సత్యనారాయణమూర్తి, రాజా వన్నెంరెడ్డి, గుడాల హరిబాబు, బోణం వెంకట నర్సయ్య, విన్నకోట వెంకటరమణ, యిమ్మిడి రాజేష్‌ను నియమించినట్లు తెలిపారు. పోటీలు ఆగస్టు నెలాఖరులో నిర్వహిస్తామని చెప్పారు. ఆగస్టు 10 లోపు అప్లికేషన్స్ పంపించాలన్నారు. ఫిలిం 15 నిమిషాలు మించి ఉండరాదని అన్నారు. పోటీలకు దర్శకులు వీర శంకర్, రేలంగి నరసింహరావు, రాజా వన్నెంరెడ్డి, ఏఎస్ ఆదిత్య, రచయిత రాజేంద్రకుమార్‌లు జడ్జిలుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ప్రాణాంతకం.. గొంతువాపు



పాడి - పంట

భీమవరం: పాడి రైతులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ పాడిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆదాయాన్ని పొందేందుకు అవకాశముంటుంది. వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, గుది పెట్టు వ్యాధులు సోకే ప్రమాదమున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో 1,78,137 గేదెలు, 45,539 ఆవులున్నాయి. పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులకు పెద్దగా అవగాహన లేక పోవడంతో వ్యాధి తీవ్రత ఎక్కువై పశు మరణాలు సంభవించడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యాధులపై రైతులు సంపూర్ణ అవగాహన కలిగి ఉంటే ఇంటి వద్దనే నిరోధించేందుకు వీలుంటుందని పశు వైద్యులు చెబుతున్నారు.

వర్షాకాలంలో గేదెలకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు ఒకటి. ఈ వ్యాధి పందుల్లో తరచుగా, గొర్రెలు, మేకల్లో చాలా అరుదుగా కనిపిస్తుంది. ఈ వ్యాధి ఏడాది పొడవునా ఎప్పుడైనా వ్యాపించే అవకాశం ఉంది. ఎక్కువగా వర్షాకాలంలో దీనిని గుర్తించవచ్చు. నదీ పరివాహక ప్రాంతాలు, డెల్టాలు, వరిసాగు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఉండే గేదెలకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఇది ఒక రకమైన సూక్ష్మజీవి ద్వారా పశువులకు వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు

ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండి వ్యాధి సోకిన 8 నుంచి 24 గంటల వ్యవధిలో పశువు చనిపోయే ప్రమాదముంది. వ్యాధి ప్రారంభ దశలో పశువు నీరసంగా ఉంటుంది. తరువాత నడవలేక పోవడం, అధిక జ్వరం, నోటి నుంచి సొంగ కారడం, ముక్కు నుంచి చిక్కటి ద్రవం స్రవించడం, కళ్లు ఎర్రబడి నీరు కారుతూ ఉండటం లక్షణాలు. ముందుగా గొంతు భాగంలో వాపు ఉండి తరువాత వాపు చెంపలు, మెడ, ముందుకాళ్ల మధ్య భాగం, పొట్ట కింద భాగం వరకూ విస్తరిస్తుంది. పశువు ఆయాసపడుతూ శ్వాస పీలుస్తుంది. సాధారణంగా ఈ దశలో పశువు నాలుక బయటకు తీస్తూ శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. ఈ దశ తరువాత కొన్ని గంటల వ్యవధిలో పశువు చనిపోతుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా..

వ్యాధి సోకిన పశువుల నుంచి కారే సొంగ, ముక్కు నుంచి స్రవించే ద్రవాల ద్వారా వ్యాధి బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. తరచుగా వ్యాధి సోకే ప్రాంతాల్లో నివసించే ఐదు శాతం పశువులు ఈ వ్యాధికి వాహకాలుగా ఉంటాయి. అలసిపోయిన, ఒత్తిడికి గురైన పశువులకు ఈ వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది. సాధారణంగా కలుషితమైన మేత, గాలి ద్వారా వ్యాధి కారకం పశువుల శరీరంలోకి ప్రవేశిస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన క్రిమి త్వరగా విభజన చెంది ఎండోక్సిన్స్ అనే విష పదార్థాలను విడుదల చేస్తుంది. ఇది రక్తంలోకి ప్రవేశించిన అనంతరం వ్యాధి లక్షణాలు బయటపడతాయి.

పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం



వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. వర్షాకాలానికి ముందు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేయించాలి. పశువైద్యుడి సలహా మేరకు సల్ఫాన్‌మైడ్స్, టెట్రాసైక్లిన్స్, పెన్సులిన్, క్లోరామ్ ఫినికాల్ వంటి యాంటి బయోటిక్ మందులు ముందుగా వాడితే ఫలితం ఉంటుంది. వ్యాధి ముదిరిన తరువాత చికిత్స పెద్దగా ఫలితం ఇవ్వదు.

పి.సుధీర్‌బాబు, పశుసంవర్ధశాఖ సహాయ సంచాలకుడు, భీమవరం

ఉద్యోగులు బాధ్యతలు గుర్తెరగాలి



ఏఈవోలకు సభ్యత్వ కార్డులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఉద్యోగులు హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరగాలని వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ శాఖ సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావు మాట్లాడుతూ ఏఈవోల న్యాయమైన డిమాండ్ల కోసం ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్‌తో కలిసి పోరాడుతున్నామన్నారు. ఏఈవోలకు జాబ్ చార్ట్, పేరు మార్పు, పదోన్నతుల స్కేల్ తదితర డిమాండ్ల కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ఏఈవోలుగా పదోన్నతి చెందిన సభ్యులకు వ్యవసాయ విస్తరణాధికారుల సంఘంలో సభ్యత్వం కల్పించారు. జిల్లా అధ్యక్షుడు నెక్కంటి రాంబాబు, కార్యదర్శి ఎండిఆర్ శివప్రసాద్, కోశాధికారి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,325 కేసుల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 6,325 కేసుల పరిష్కారం అయినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన అధికారులకు, కక్షిదారులకు కృతజ్ఞతలు తెలిపారు. 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసును రాజీ చేశామని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులు, పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, బీమా, బ్యాంకు అధికారులకు ఇతర విభాగాలకు చెందిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏలూరు జిల్లాలో 2844 కేసుల పరిష్కారం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మెగా లోక్ అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కరించామని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మెగా లోక్ అదాలత్‌లో 2,844 కేసులు ఇరువర్గాల ఆమోదంతో పరిష్కారమయ్యాయని తెలిపారు. రాజీ మార్గమే శ్రేయస్కరమనే నినాదంతో చిన్నపాటి తగాదాలు, కుటుంబ, వివాహ సంబంధిత తగాదాలు, రోడ్డు ప్రమాదాలు వంటి కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఉత్తమ మార్గమని ఎస్పీ అభిప్రాయపడ్డారు. లోక్ అదాలత్‌లో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులకు సంబంధించి ఇరు వర్గాల సమ్మతితో పరిష్కారం అయ్యాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఐపీసీ కేసులు –827, స్పెషల్ అండ్ లోకల్ లాస్ కేసులు–417, ఎక్సైజ్ కేసులు–143, పీటీ కేసులు–1454 ఉన్నాయని జిల్లా ఎస్పీ శివకిషోర్ స్పష్టం చేశారు. రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారంలో డీసీఆర్‌బీ సీఐ హబీబ్ బాషా, ఎస్ఐ రాజారెడ్డి, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ యం.సుబ్బారావు కృషి చేశారని చెప్పారు.

ఆటో బోల్తా.. 10 మందికి గాయాలు



గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెం గ్రామంలో ఆదివారం ఆటో బోల్తా పడిన సంఘటనలో పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎనిమిది మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన డి.సాయికుమారి, సీహెచ్ నాగబాబులు ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కూలి పని కోసం కొత్తూరు నుంచి గోపన్నపాలెం గ్రామానికి వచ్చి పని ముగించుకొని తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కూలీల ఆటో బోల్తా పడింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

గుడ్లూరు: లారీని బొలేరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తెట్టు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా కలిదిండి మూలలంక గ్రామానికి చెందిన కేతా సాయిబాబా(24), క్లీనరు పుట్టా నాగరాజు (19) బొలెరో వాహనంలో చేపల లోడుతో బయలుదేరారు. హైదరాబాద్ నుంచి లారీ కర్ణాటకకు వెళ్తోంది. సరిగా తెట్టు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో బొలెరో వాహనం తప్పించబోయి ఢీకొట్టాడు. దీంతో కేతా సాయిబాబా, పుట్టానాగరాజు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న 108 వాహనం అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం కందుకూరు ఆసుపత్రికి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు



పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తున్న పట్టణంలోని ఖాళీ స్థలం



ఖాళీ స్థలాల్లో నిలిచిపోయిన వర్షపు నీరు

- పొదలను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- కొరడా ఝుళిపించని అధికారులు
- ఇదీ గూడెంలో పరిస్థితి

తాడేపల్లిగూడెం: ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో దోమలతో తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి తాడేపల్లిగూడెం పట్టణంలో కనిపిస్తుంది. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ భారాన్ని వహించాల్సిన మున్సిపాలిటీ కాలానుగుణంగా దోమల నివారణ చర్యలపై దృష్టి సారించడం లేదు. ఆయిల్ బాల్స్ డ్రెయిన్లలో వేయడం లేదు. గంబూ షియా చేపలు వదలడంలేదు. ప్రైవేట్ స్థలాలు పొదలుగా మారినా మునిసిపల్ అధికారులు కొరడా ఝుళిపించడం లేదు. ప్రజలకు దోమ హింస తప్పడం లేదు. దోమ జీవిత కాలం ఎనిమిది రోజులు. దోమ కుడితే మాత్రం రకరకాల జబ్బులు జీవితకాలం జనాన్ని వేధిస్తుంటాయి. ఆడ ఎనాఫి లస్ దోమ కుడితే మలేరియా, పగటిపూట టైగర్ దోమ కుడితే డెంగీ, ఈడీస్ కుడితే చికున్‌గున్యా, సాల్మనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా వలన టైఫాయిడ్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయి. పట్టణంలో లక్ష పైచిలుకు జనాభా పగలు, రాత్రి తేడా లేకుండా దోమల బాధతో ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో ఉన్న 27 వేల 192 కుటుంబాలు తమ ఇంటి బడ్జెట్‌లో దోమల నివారణకు ప్రత్యేక కేటాయింపులు చేస్తున్నారు. కుటుంబానికి రోజుకు సరాసరి పది రూపాయలు చొప్పున నెలకు 300 రూపాయలు, సంవత్సరానికి 3600 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన చూసుకుంటే పట్టణంలో ఉన్న కుటుంబాలు దోమల కోసం చేస్తున్న ఖర్చు తొమ్మిది కోట్ల 78 లక్షల 91 వేల రెండు వందల రూపాయలు. ఇది దోమల నివారణకు వాడే అగరబత్తి, క్వాయిల్స్, మ్యాట్లు, లిక్విడ్స్, పేపర్లు వంటి వాటి కోసం ఖర్చు చేస్తున్నారు. దోమలు కుట్టడం వలన సంక్రమించే వ్యాధులు తగ్గించుకోడానికి వైద్యానికి చేసేది అదనపు ఖర్చు కలుపుకుంటే ఇంకా పెరుగుతుంది. పట్టణంలో ఉన్న 35 వార్డుల్లో ఖాళీ జాగాలు అధికంగా ఉండటం. వాననీరు సక్రమంగా వెళ్లే మార్గాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో డ్రెయిన్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, కొబ్బరి బొండాలు దోమల ఉత్పత్తికి కేరాఫ్‌గా మారుతున్నాయి.

ఫాగింగ్ అంతంత మాత్రమే

పట్టణంలో దోమల నివారణకు గతంలో హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలు వాడేవారు. వాటి వాడకం తగ్గింది. కింగ్ ఫాగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. అవి కాలంచెల్లడంతో భయంకర చేసే శబ్దాలు ఎక్కువ. వెదజల్లే పొగ తక్కువ అన్న విధంగా పనిచేస్తున్నాయి. వార్డులో నెలకు మూడు సార్లు ఫాగింగ్ చేస్తున్నట్టుగా అధికారులు చెబుతున్నారు. దోమలు లార్వా దశ సమయంలో వాటి నిరోధానికి ఆయిల్ బాల్స్ వినియోగించాలి. లార్వాలు అభివృద్ధి చెందకుండా డ్రెయిన్లలో గంబూషియా చేపలను వదిలేవారు. వాటిని వదలడం మానేశారు. దోమల నివారణకు పురపాలక సంఘానికి ప్రత్యేక బడ్జెట్ లేకపోవడం, 35 వార్డులు, నాలుగు శానిటరీ డివిజన్లలో ఒకేసారి దోమల నివారణ మందు పిచికారీ చేసే పరిస్థితి లేదు. దోమలను నిర్మూలిస్తాం అంటూ ప్రకటనలు చేసినా, అది దండగలా ఉంది. దోమలు యథావిధిగా ప్రజలను కుడుతున్నాయి. వానాకాలం వచ్చేసింది. ఏ ప్రైవేట్ స్థలం చూసినా, అడవులను తలపిస్తోంది. సాధారణ దోమలతో నల్ల దోమలు ఇబ్బంది పెడుతున్నాయి. అవి కుట్టాయంటే చాలు పెద్దపెద్ద దద్దుర్లు శరీరంపై వస్తున్నాయి. ఏం వాడినా దోమల బెడద తప్పడం లేదు. వీటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శానిటేషన్ ఖర్చు బారెడు.. దోమల నివారణ మూరెడు

- పట్టణంలో ఉన్న వార్డులు – 35
- పట్టణ జనాభా –1,03,577
- పట్టణ విస్తీర్ణం – 20.71 చదరపు కిలో మీటర్లు
- పట్టణంలో కుటుంబాలు – 27,192
- మురికి వాడలు – 42
- మురికి వాడల్లో జనాభా – 44, 825
- రోజూ పట్టణంలో వచ్చే చెత్త– 80టన్నులు
- శానిటేషన్ కాంట్రాక్టు కార్మికులు – 192
- ఏడాదికి వీరికి జీతాల కింద చేసే ఖర్చు – సుమారు రూ.2 కోట్ల 99 లక్షల 74 వేల 600
- పర్మినెంట్ శానిటరీ కార్మికులు – 91
- ఏడాదికి వీరికి ఇచ్చే జీతాలు – సుమారు రూ.3 కోట్ల 49 లక్షల 920
- దోమల నివారణ, ఇతర పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఖర్చు–సుమారు 80 లక్షల నుంచి కోటి రూపాయలు.

క్లుప్తంగా


లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



లక్ష్మీనారాయణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అషాడ మాసం తొలి ఏకాదశి పురస్కరించుకొని వాసవి పంచాయతన క్షేత్రంలో వేంచేసిన లక్ష్మీ నారాయణ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, లక్ష్మీ నారాయణ స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, పలు ఫల రసాలతో విశేష పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలయ కార్యదర్శి ఆలపాటి సత్యనారాయణ, కృష్ణకుమార్, కార్యవర్గ సభ్యులు కనిగళ్ల ఆంజనేయులు, తదితరులు పర్యవేక్షించారు.

వరాల వెంకన్నకు అభిషేక పూజలు



వరాల వేంకటేశ్వరస్వామి

అత్తిలి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామికి ఆదివారం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామివారి మూల విరాట్‌కు పంచామృతాలు, పళ్ల రసాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి. ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేకాలు



శ్రీకృష్ణపరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తొలి ఏకాదశి పురస్కరించుకొని స్థానిక రామచంద్రరావు పటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో నెలవైయున్న శ్రీకృష్ణ పరమాత్మకు ఆదివారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు, విశేష అలంకరణలు ఆలయ అర్చకులు ఇవటూరి శశికాంత్ శర్మచే ఘనంగా నిర్వహించారు. పరివార దేవతలకు సామూహిక అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. మందిర క్యాదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.

ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలు



వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటికే పరిమితమైన వృద్ధులకు సీనియర్ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వృద్ధులకు వైద్య సేవలు అందించారు. తణుకు పట్టణ పరిధిలోని పలుప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా పర్యటించి ఏడుగురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థికసాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైనవారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

కళాకారుల సమాహారం జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ ఆదివారం నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించనున్నట్లు ఏలూరుకు చెందిన గరగపర్తి శ్రీనివాసరావుచే సత్కారాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆత్మబంధువులం సేవా సంఘ అధ్యక్షుడు వెజ్జు దుర్గా ప్రసాద్‌కు గౌరవ పురస్కారం, ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్‌గా పనిచేసిన యేలూ రి సత్యనారాయణ మూర్తికి ఉద్యోగ పురస్కారం, నాదస్వర విద్యాంసులు గరగపర్తి శ్రీనివాసరావుకు కళా పురస్కారం, నటులు దేవిశెట్టి కృష్ణారావుకు ఆర్థిక సత్కారం చేస్తామన్నరు. కళాకారులు, సాహితీ ప్రముఖులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సౌత్ సబ్‌స్టేషన్ పరిధిలో యాగర్లపల్లి నుంచి కె.పెంటపాడు వరకు లైన్ స్ట్రింగింగ్ వర్క్ నిమిత్తం కె.పెంటపాడు ప్రధాన సబ్‌స్టేషన్‌కు సంబంధించి పడాల, జట్లపాలెం, కొబ్బరితోట, యాగర్లపల్లి ఫీడర్లకు సంబంధించి ఈ నెల 7వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. పడాల, భాగ్యలక్ష్మిపేట, యాగర్లపల్లి, కొబ్బరితోట, ఏలూరు రోడ్డు, రామచంద్రరావు పేట, మోడ్రన్ కేఫ్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న జమాతే ఇస్లాం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ నాయకులు పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. జమాతే ఇస్లాం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు, పిల్లల విభాగంచే చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ కలుషిత వాతావరణం పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలన్నారు. పెద్ద ఎత్తున చెట్లు నాటడం ద్వారా పరిశుభ్రమైన ఆక్సిజన్ భవిష్యత్ మానవాళికి అందుతుందని చెట్లును సంరక్షించుకోవాలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నౌషాద్ మొహిద్దీన్, మహబూబ్ బాషాలు మాట్లాడారు. మహిళా విభాగం అధ్యక్షురాలు నసీమా, రుక్సానా, అస్మ, షాకీరా, ఆఫ్రిన్, ముస్లిం మహిళలు, పిల్లలు హాజరయ్యారు.

జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అత్తిలి: పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశు వైద్యులు

అత్తిలి: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్తిలి ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమణారావు అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం అత్తిలి ప్రాంతీయ పశు వైద్యశాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అత్తిలి వారి సహకారంతో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణారావు మాట్లాడుతూ రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైందని, ముందుగా వ్యాక్సిన్ వేయించడం ద్వారా దీనిని నివారించొచ్చన్నారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ శంకర భావన్నారాయణ మాట్లాడుతూ మనుషులు, పశువుల సహచర్యంతో జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తాయని, ఈ వ్యాధులు సుమారు 280 వరకు గుర్తించబడ్డాయన్నారు. ర్యాబీస్ వ్యాధి అనేది పిచ్చి కుక్క కాటు ద్వారా వ్యాపించే అతి భయంకరమైన వ్యాధని, కాటుకు గురైన వెంటనే గాయాలను సబ్బు, నీటితో శుభ్రంగా కడిగి ప్రథమ చికిత్సా పద్ధతులను పాటించి వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించి యాంటీ రేబిస్ టీకాల కోర్సు చేయించుకోవాలన్నారు. పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు ప్రతి ఏడాది వేయించాలని సూచించారు. వ్యాధి సోకిన పశుపక్ష్యాదులను మంద నుంచి వేరు చేసి వెంటనే చికిత్స అందించాలని చెప్పారు. పందుల ద్వారా మెదడు వాపు వ్యాధి వస్తుందని, ఆంత్రాక్స్ వ్యాధి సోకిన గొర్రెలు, మేకల మాంసం తినడం ద్వారా ఆంత్రాక్స్ వ్యాధి మనుషులకు వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జంతు సంక్షేమ శాఖ డైరెక్టర్ అల్తి అజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ మొదటి ఉపాధ్యక్షుడు ఉలుసు భాస్కరరావు, సెక్రటరీ చిట్టాల బాలకృష్ణ, రెండో ఉపాధ్యక్షుడు వేమన సోమేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు సీతాల వెంకట నారాయణ, దాసం బాబ్జి, సన్నిధి సూర్యనారాయణ గుప్త, గొర్లె వెంకట్రావు, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



తణుకు అర్బన్: జూనోసిస్ వ్యాధులపై ప్రచారం చేస్తున్న డాక్టర్ ప్రసాద్ తదితరులు

జూనోసిస్ వ్యాధులపై అవగాహన

తణుకు అర్బన్: పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులైన జూనోటిక్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాకాని ప్రసాద్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా తణుకు పశువర్ధక శాఖ భవనంలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే పెంపుడు శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ ప్రభుత్వ పశువర్ధక శాఖ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎల్ సాయిబాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్యులు

పట్టెంపాలెంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని పట్టెంపాలెం పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి టీవీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ శునకాల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కుక్క కరిచిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. పెంపుడు కుక్కలు ఉన్న ప్రతీ ఒక్కరూ క్రమం తప్పకుండా యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. అటెండర్ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు



తణుకు అర్బన్: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తణుకు అర్బన్: భారతదేశ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, ఎంటీసీ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులర్పించారు. వేదికపై ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల సమానత్వానికి కృషి చేయడమే కాకుండా ఇండియా పాక్ యుద్ధంలో భారత రక్షణ మంత్రిగా కీలకపాత్ర పోషించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మెహర్ అన్సారీ, నేతలు నూకల కనకదుర్గ, ఉండవల్లి జానకి, నత్తా కృష్ణవేణి, ఝాన్సీ లారెన్స్, కంకటాల సతీష్ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఆయన జీవిత విశేషాలను వెల్లడించారు. కేంద్ర మంత్రివర్గంలో ఎక్కువ కాలం పనిచేశారని తెలిపారు. బీసీ సంఘం నాయకులు కేశవభట్ల విజయ్, తుమరాడ చిన్న, వర్తనపల్లి కాశీ, అల్లు నాగు, లోవరాజు, నరసింహమూర్తి, వెంకటాచలం, రాజశేకర్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా ఐశ్వర్యదుర్గమ్మ



ఐశ్వర్యదుర్గమ్మకు ఆషాడమాస సారెను తీసుకొస్తున్న భక్తులు



శాకంబరీదేవి అలంకారంలో అమ్మవారు

అత్తిలి: ఆషాడమాసం తొలి ఏకాదశి సందర్భంగా రామన్నపేటలో గల ఐశ్వర్య దుర్గాదేవి ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. అర్చకస్వామి చేబోలు రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా ఆషాడ సారెను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరీగా అలంకరించారు.

శాకంబరీదేవిగా శ్రీవిశ్వ దుర్గేశ్వరీ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తొలి ఏకాదశి సందర్భంగా ఆదివా రం స్థానిక 17వ వార్డు విశ్వదుర్గే శ్వరీ సమేత ఆనందేశ్వరస్వామి ఆలయంలో విశ్వ దుర్గేశ్వరీ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. భక్తులచే ఆషాడం సారెను మేళ తాళాలతో, తీన్మార్ డప్పులతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించారు.

శిక్షణతో నైపుణ్యం పెంపుదల



మోడల్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరించిన కామేష్

తణుకు అర్బన్: సమాజంలో ఏ అంశంలోనైనా శిక్షణ నైపుణ్యాన్ని పెంచుతుందని ఉభయ గోదావరి జిల్లాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. జూనియర్ సివిల్ జడ్జెస్ ఉద్యోగాల కోసం ఆదివారం తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ టెస్టు పేపర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో న్యాయ వ్యవస్థ అవసరం పెరిగిందని, ప్రజలకు అత్యున్నత న్యాయాన్ని అందించడంలో న్యాయ వ్యవస్థ ముందు భాగంలో ఉందని స్పష్టం చేశారు. న్యాయవాదులు మోడల్ టెస్టు పేపర్ రాశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాసరావు, న్యాయవాదులు పిట్ట సురేష్ కుమార్, వెన్నపు సుధాకర్, షేక్ మోతి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక చెట్లు రోడ్డులో ఆదివారం ఉమర్ ఆలీషా విజ్ఞాన పీఠంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం యోగ విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. ఆరా ఫౌండేషన్ సభ్యులు ముత్యాలకృష్ణ, అపర్ణప్రసాద్, రామాంజనేయులు, సూరిబాబు, నున్న నాగేశ్వరరావు, రాంబాబు, వెంకట్, సుభద్ర గుప్తా, రేణుక, సుజాత, సుజి పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశికి పూజలు

తణుకు అర్బన్: తొలి ఏకాదశి కావడంతో ఆదివారం తణుకులో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, సాయిబాబా, విఘ్నేశ్వర స్వామి, శివాలయాలు, కనకదుర్గమ్మ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయ అర్చకులు పూజాధికాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో నీలాద్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి, బంగారుగూడెం శ్రీసువర్ణలక్ష్మీనరసింహస్వామి, కుంచనపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమయమంతుల దుర్గా కాశీ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' వివరాలు తెలుసుకోండిలా..

అత్తిలి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులా, అనర్హులా అని యాప్‌లో వారి స్టేటస్ ద్వారా తెలుసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి టికే రాజేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు కలిగి ఉండి ఈ–పంట నమోదులో తమ పేరు ఉంటే ఈ పథకానికి అర్హులని తెలిపారు. డీ పట్టా, ఈనాం భూములు, అసైన్డ్ భూములు కలిగిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులన్నారు. ప్రభుత్వ భూమి సాగుదారులు ఈ పథకానికి అర్హులు కాదని చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన నిధులు రెండు విడతల్లో చెల్లిస్తారన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందని తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో రైతుల పేర్లు తప్పుగా నమోదయితే రెవెన్యూ అధికారులతో తమ ఆధార్ కార్డు ద్వారా సరి చేయించుకోవాలని ఏఓ రాజేష్ తెలిపారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

తణుకు అర్బన్: కార్మిక హక్కులను హరిస్తూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కోడ్ల రద్దు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆదివారం తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ల ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అక్కమాంబ టెక్స్ టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చిక్కాల దుర్గాప్రసాద్, ఎస్.ఫణీంద్ర, దేవ పెద్దిరాజు, పంపన శ్రీను, అనంత త్రివిక్రమరావు, విడివాడ ప్రసాద్, పుచ్చకాయల భాస్కరరావు, ఇసుకపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.